సాక్షి
పెద్దపల్లి
గురువారం । 29 । జూన్ । 2023



పోచమ్మకు బోనాలు

వేములవాడరూరల్: వేములవాడ మండలం వట్టెంల గ్రామ ముదిరాజ్‌లు బుధవారం పోచమ్మకు బోనాలు తీశారు. సర్పంచ్ యామ సుమతి, కుల పెద్దలు పాల్గొన్నారు.



పైపులైన్ ద్వారా వంట గ్యాస్

రాష్ట్రంలో ఇంటింటికీ పైపులైన్ ద్వారా గ్యాస్ సరఫరా చేసేందుకు చేపడుతున్న పనులు చివరి దశకు చేరుకున్నాయి. 8లో

వాతావరణం

గరిష్టం/కనిష్టం
28.0/25.0

ఆకాశం మేఘావృతమై ఉంటుంది. జిల్లాలోని చాలా ప్రాంతాల్లో వర్షం కురిసే అవకాశం ఉంది.

న్యూస్‌రీల్

పెన్షనర్ల సమస్యలు పరిష్కరించండి



అడిషనల్ కలెక్టర్ లక్ష్మీనారాయణకు వినతిపత్రం ఇస్తున్న నాయకులు

పెద్దపల్లిరూరల్: పింఛన్‌దారులకు నగదుర హిత వైద్యసేవలను అందించేలా చర్యలు తీసుకోవాలని పెన్షనర్ల సంఘం రాష్ట్ర నాయకులు వీరగోని పెంటయ్య కోరారు. కలెక్టరేట్ ముందు బుధవారం జాయింట్ యాక్షన్ కమిటీ ఆధ్వర్యంలో ధర్నా నిర్వహించి అడిషనల్ కలెక్టర్ లక్ష్మీనారాయణకు వినతిపత్రం అందించారు. కార్పొరేట్ స్థాయి ఆసుపత్రుల్లో పెన్షనర్లకు వైద్యసాయం అందించాలన్నారు. జిల్లాలో వెల్‌నెస్‌సెంటర్లు ఏర్పాటు చేయాలని, బకాయిపడిన రెండు కరువు భత్యాలను చెల్లించాలని డిమాండ్ చేశారు. జూలై ఒకటి నుంచి కొత్త పేకమిషన్ అమల్లోకి వస్తోందని, అందుకనుగుణంగా కొత్త పే కమిషన్ నియమించాలని కోరారు. నాయకులు రామగిరి నర్సింగం, డేనియల్, సాల్మన్, అనంతరావు తదితరులున్నారు.

బక్రీద్‌కు ఏర్పాట్లు పూర్తి



ఈద్గా వద్ద శుభ్రం చేస్తున్న మున్సిపల్ కార్మికులు

సుల్తానాబాద్: మండలకేంద్రంలోని ఈద్గాను బక్రీద్‌కు సిద్ధం చేస్తున్నారు. మున్సిపల్ కార్మికులతో పరిసరాలు శుభ్రం చేయించినట్లు చైర్‌పర్సన్ ముత్యం సునీత, కమిషనర్ రాజశేఖర్ తెలిపారు.

బాధ్యతలు స్వీకరించిన ఎన్టీపీసీ సీజీఎం



కేదార్ రంజన్ పాండు

జ్యోతినగర్: ఎన్టీపీసీ రామగుండం ప్రాజెక్టు చీఫ్ జనరల్ మేనేజర్‌గా కేదార్‌రంజన్‌పాండు బుధవారం పరిపాలనా భవనంలోని ఆయన చాంబర్‌లో బాధ్యతలు స్వీకరించారు. ఉత్తరప్రదేశ్‌లోని ప్రాజెక్టులో సీఈవోగా పనిచేసిన పాండును ఇక్కడికి బదిలీ చేశారు. ఆయనకు ఉన్నతాధికారులు పుష్పగుచ్ఛం అందించి శుభాకాంక్షలు తెలిపారు.

ఎన్టీపీసీలో పర్యటించిన సీఐఎస్‌ఎఫ్ డీఐజీ



సీఐఎస్‌ఎఫ్ బ్యారక్స్‌లో పర్యటిస్తున్న డీఐజీ నందన్

జ్యోతినగర్: ఎన్టీపీసీ రామగుండంలో సీఐఎస్‌ఎఫ్ డీఐజీ నందన్ పర్యటించారు. బుధవారం మల్కాపూర్ రోడ్‌లోని సీఐఎస్‌ఎఫ్ బ్యారక్స్‌ను సందర్శించారు. సీఐఎస్‌ఎఫ్ ఉద్యోగులు నివసిస్తున్న ప్రాంతంలోని పార్కును, తదితర విభాగాలను పర్యవేక్షించారు. అనంతరం విద్యుత్ ఉత్పత్తి ప్లాంటులో భద్రతా విభాగం నిర్వహిస్తున్న సీఐఎస్‌ఎఫ్ ప్రాంతాలను పరిశీలించి రక్షణ, భద్రత చర్యలపై సమీక్షించారు. డీఐజీతో సీఐఎస్‌ఎఫ్ అధికారులు ఉన్నారు.

లేడీస్ క్లబ్ ఆత్మీయ సమ్మేళనం



ఆత్మీయ సమ్మేళనంలో మహిళలు

గోదావరిఖని: సింగరేణి అధికారుల లేడీస్‌క్లబ్ ఆధ్వర్యంలో బుధవారం ఆత్మీయ సమ్మేళనం నిర్వహించారు. ఆర్జీ–1 క్లబ్, ఆర్జీ–2 క్లబ్ అధ్యక్షులు లక్ష్మి, సవిత, ప్రియదర్శిని, జయ, పద్మ, బీనాసింగ్, నీరజ, స్వరూప, రజిత, రజిని పాల్గొన్నారు.

ముంపు ముప్పు..

- కొద్దిపాటి వర్షాలకే రోడ్లు జలమయం
- నాలాలు ఒక్కోచోట ఒక్కోలా..
- ఎప్పటిలాగే ఈసారి కూడా ప్రమాదమంటున్న ప్రజలు
- ఏటా మునుగుతున్న మంథని, గోదావరిఖని

వర్షాకాలం మొదలైంది. ఎప్పటిలాగే ముంపు ప్రాంతాల ప్రజల్లోనూ భయం పట్టుకుంది. చిన్నపాటి వర్షం కురిసినా నాలాలు పొంగడం.. లోతట్టు ప్రాంతాల్లోని ఇళ్లన్నీ నీటమునగడం ఏటా జరుగుతుండడమే వారి భయానికి కారణం. అధికారయంత్రాంగం నిర్లక్ష్యం వీడకపోవడం.. నాలాలను పట్టించుకోకపోవడంతో ఎప్పటిలాగే ఈ ఏడాది కూడా పొంగిపొర్లనున్నాయి. నాలాలు ఒక్కోచోట ఒక్కోలా చేపట్టడంతో ప్రజలకు ఇబ్బందులు తప్పేలా కనిపించడం లేదు. ఈ పరిస్థితి ఉమ్మడి జిల్లావ్యాప్తంగా నెలకొంది.

– సాక్షి ప్రతినిధి, కరీంనగర్



జలమయమైన కరీంనగర్‌లోని రాంనగర్ (ఫైల్)

చిన్న వానకే కరీం'నగరం' జలమయం..

- కరీంనగర్ కార్పొరేషన్ పరిధిలో చాలాచోట్ల ప్రధాన రహదారులు, కాలనీలు చిన్నపాటి వర్షాలకే జలమయం అవుతున్నాయి.
- నగరంలోని రాంనగర్, మంకమ్మతోట, విద్యానగర్, భాగ్యనగర్, ఆర్టీసీ వర్క్‌షాప్, సూర్యనగర్, జ్యోతినగర్, ముకరంపుర, తిరుమల్‌నగర్, గణేశ్‌నగర్, హనుమాన్‌నగర్, లక్ష్మీనగర్ తదితర ప్రాంతాలు గతంలో ముంపునకు గురయ్యాయి.
- నగరం ఎగువ భాగమైన శాతవాహన యూనివర్సిటీ ఏరియా, విద్యానగర్, రాంనగర్, ఆర్టీసీ వర్క్‌షాప్ తదితర ప్రాంతాల నుంచి డ్రైనేజీ నీరు, వరదనీరు భాగ్యనగర్, మంకమ్మతోట, జ్యోతినగర్, ముకరంపుర, తిరుమల్‌నగర్, హనుమాన్‌నగర్, లక్ష్మీనగర్ మీదుగా దిగువ ప్రాంతానికి చేరుతుంటాయి.
- ఈ ప్రాంతాల్లోని డ్రైనేజీలు, నాలాలు ఒక్కచోట 6 నుంచి 8 ఫీట్ల వెడల్పు ఉంటే, మరోచోట డ్రైనేజీ సామర్థ్యం 2 నుంచి 4 ఫీట్లే.
- చాలా చోట్ల డ్రైనేజీల్లో ప్లాస్టిక్, భవన నిర్మాణ వ్యర్థాలు వేయడంతో మూసుకుపోతున్నాయి.
- ఎప్పటికప్పుడు నాలాలు, డ్రైనేజీల్లో సిల్ట్ తొలగించకపోవడం, వర్షాకాలం వచ్చాక హడావుడిగా పనులు చేపడుతుండడంతో అనుకున్న మేర లక్ష్యం నెరవేరడం లేదు.
- అంబేద్కర్ స్టేడియం ముందు ప్రధాన నాలాపై డ్రైనేజీ నిర్మించడంతో గణేశ్‌నగర్, హనుమాన్‌నగర్ ప్రాంతాలు మాత్రం ముంపు బారి నుంచి బయటపడ్డాయి.
- నగరంలోని ఎగువ ప్రాంతాల నుంచి వచ్చే డ్రైనేజీ ఈ నాలా గుండా లక్ష్మీనగర్ వైపు వెళుతుంది.
- రాంనగర్, సంతోష్‌నగర్‌లో పరిస్థితిలో కాస్త మార్పు కనిపిస్తున్నా భారీ వర్షాలు కురిస్తే అసలు విషయం తెలుస్తుందని స్థానికులు చెబుతున్నారు.
- పద్మనగర్, రాంనగర్, సంతోష్‌నగర్ నుంచి వచ్చే డ్రైనేజీ నీళ్లు కలిసే కల్వర్టును పెద్దగా నిర్మించారు. ఇది ఏ మేరకు ఫలితాన్నిస్తుందనేది భారీ వర్షాలు పడితే గాని తెలియదు.
- జ్యోతినగర్ సంతోషిమాత దేవాలయం వెనుకాల డ్రైనేజీ నిర్మాణం చేపట్టారు. ఇక ఇతర ప్రాంతాల్లో పరిస్థితి ముంపునకు చేరువలోనే ఉంది.
- టూటౌన్ పోలీస్‌స్టేషన్ పక్కన నాలా నిర్వహణ లోపంతో సమీపంలోని ఇళ్లు ముంపునకు గురవుతున్నాయి. ఇక్కడ నాలాపై స్లాబ్ నిర్మిస్తే తప్ప సమస్య పరిష్కారం కాదంటున్నారు స్థానికులు.
- బైపాస్ రోడ్డు ప్రాంతం నీటమునిగి వచ్చిపోయే వాహనాలకు ఇబ్బందులు ఏర్పడుతున్నాయి.

ముంపు సమస్య తొలగించాలి



వర్షాకాలం వచ్చిందంటే మా ప్రాంతం ముంపునకు గురవుతుంది. టూటౌన్ పోలీసు స్టేషన్ పక్కనున్న నాలా నిర్వహణ లేకపోవడంతో వరదనీళ్లు ఇండ్లల్లోకి వస్తున్నాయి. ఇటీవల సిల్ట్ తీసారు. సైడ్ వాల్స్ నిర్మిస్తామంటున్నారు. కాని శ్లాబ్ నిర్మిస్తే మాకు శాశ్వత పరిష్కారం దొరుకుతుంది.

– బి.శ్రీనివాస్, ముకరంపుర, కరీంనగర్

సిరిసిల్లను వెంటాడుతున్న వరదలు



పాతబస్టాండును ముంచెత్తిన వరద(ఫైల్)

- సిరిసిల్లలో చిన్నపాటి వర్షానికే డ్రైనేజీలు పొంగుతున్నాయి. కార్గిల్‌లేక్, రాయించెరువు, తుమ్మలకుంట, కొత్తచెరువులకు సంబంధించిన దాదాపు 20 నాలాలు పూర్తిగా ఆక్రమణకు గురయ్యాయి.
- వర్షాలు కురిసి ఈ చెరువులు నిండి మత్తడి దూకి లోతట్టు ప్రాంతాలను వరద ముంచెత్తుతోంది.
- నాలాలు కబ్జా అవుతున్నాయని స్థానికులు ఆందోళనలు చేపట్టగా వరద ముంపు లేకుండా చేస్తామని అధికారులు, పాలకులు హామీ ఇచ్చినా కార్యరూపం దాల్చడం లేదు.
- సాయినగర్ నుంచి శాంతినగర్‌కు వచ్చే ప్రధాన మురికికాల్వలో పేరుకుపోయిన పూడికను తొలగించాల్సి ఉంది.
- వెంకంపేట ప్రాంతంలో చేపట్టిన డ్రైనేజీ, సీసీరోడ్లు పూర్తయితేనే వరదలు తగ్గే అవకాశం ఉంది.
- కొత్తచెరువు నుంచి వచ్చే వరదనీరు శ్రీనగర్ కాలనీని ముంచెత్తకుండా బైపాస్‌రోడ్డు వరకు పెద్దకాల్వను నిర్మించాలి.
- పట్టణంలో వరదలు రాకుండా రూ.2.50 కోట్లతో పనులు ఏడాది కాలంగా కొనసాగుతున్నాయి.

పెద్దపల్లిలో కరకట్ట కట్టాల్సిందే..

- కాళేశ్వరం ప్రాజెక్టులో భాగంగా నిర్మించిన బ్యారేజీల బ్యాక్‌వాటర్‌తో గతేడాది గోదావరిఖని, మంథని పూర్తిగా నీటమునిగాయి.
- ఎల్లంపల్లి నుంచి మేడిగడ్డ వరకు ప్రతి 30 నుంచి 40 కిలోమీటర్లకో బ్యారేజీ నిర్మించారు. గతేడాది కురిసిన వర్షాలకు మహారాష్ట్ర నుంచి కూడా భారీగా వరద నీరు పోటెత్తింది.
- సుందిళ్ల, అన్నారం బ్యారేజీల బ్యాక్‌వాటర్ గోదావరిఖనిలోని మల్కాపూర్, సప్తగిరికాలనీ, ప్రశాంత్‌నగర్, రెడ్డికాలనీ, రఘుపతిరావ్‌నగర్‌ను ముంచెత్తింది.
- అన్నారం బ్యారేజీ బ్యాక్‌వాటర్‌తో మంథనిలోని మర్రివాడ, వాగుగడ్డ, బోయినిపేట, లైన్‌గడ్డ, దొంతులవాడ, భగత్‌నగర్, చాకలివాడ, మంగలివాడ, దుబ్బగూడెం, ఎస్సీకాలనీ, అంబేద్కర్‌నగర్ నీటమునిగాయి.
- గోదావరి ఒడ్డున 8 కిలోమీటర్ల మేర సుందిళ్ల వరకు కరకట్ట నిర్మించారు. రామగుండం వరకు మరో 5కిలోమీటర్ల మేర కరకట్టకు రూ.110 కోట్లతో అంచనాలు సిద్ధం చేసినా కార్యరూపం దాల్చలేదు.



వరదలతో నీట మునిగిన గోదావరిఖని(ఫైల్)

కరకట్టతోనే పరిష్కారం



కాళేశ్వరం నిర్మాణ సమయంలో ల్యాడర్ సర్వే చేసినప్పుడే గోదావరిఖనిలోని పలు ప్రాంతాలు మునుగుతాయని తేలింది. నదికి ఇరువైపులా కరకట్టలు నిర్మించాలని సూచించారు. సుందిళ్ల వరకు మాత్రమే నిర్మించి వదిలేశారు. రామగుండం వరకు మరో 5 కిలోమీటర్ల మేర కరకట్ట నిర్మిస్తే సమస్య పరిష్కారం అవుతుంది.

– మద్దెల దినేష్, సీపీఐ నాయకుడు గోదావరిఖని

వర్షమొస్తే భయమే



గతేడాది బొక్కలవాగు ద్వారా వచ్చిన నీరు ఇళ్లలోకి చేరి సర్వం కోల్పోయాం. కనీసం పలుకరించిన వారు లేరు. ముంపు నివారణకు చర్యలు తీసుకున్న దాఖలాలు లేవు. ఆనాడు నీటిపారుదల శాఖ అధికారులు మమ్మల్ని అప్రమత్తం చేస్తే నష్టపోయేవాళ్లం కాదు.

– దొంతుల రాజలింగయ్య, దొంతులవాడ, మంథని

జగిత్యాలలో తెగిపోతున్న సంబంధాలు



గోవిందుపల్లి-వెంకటాద్రినగర్ కల్వర్టు

- స్పెషల్ గ్రేడ్ మున్సిపాలిటీగా ఉన్న జగిత్యాలలో 1.30 లక్షల జనాభా ఉన్నా.. డ్రైనేజీ సమస్య మాత్రం తీరడం లేదు.
- వర్షాకాలం వచ్చిందంటే ఇందిరానగర్, గాంధీనగర్, జెండామహెళ, తీన్‌ఖని, గోవిందుపల్లి, వెంకటాద్రినగర్, సవురాల కాలనీ, చిలుకవాడ, బైపాస్‌రోడ్ తదితర ప్రాంతాల్లో ప్రజలు ఇబ్బంది పడుతున్నారు.
- డ్రెయినేజీ వ్యవస్థ సరిగా లేక వరద నీరు ఇళ్లలోకి చేరుతోంది.

ఎక్కడి వాళ్లు అక్కడే



వెంకటాద్రినగర్, గోవిందుపల్లి మధ్య కల్వర్టు గట్టి వాన పడితే నీట మునుగుతుంది. బాహ్యప్రపంచానికి సంబంధాలు తెగిపోతాయి. భారీ వర్షం పడితే రోజులతరబడి ఇంట్లోనే ఉండాల్సిన పరిస్థితి. హైలెవల్ కల్వర్టు నిర్మించి సమస్య పరిష్కరించాలి.

– గోపి లక్ష్మణ్, వెంకటాద్రినగర్, జగిత్యాల

ఇళ్లలోకి నీరు



పట్టణంలోని కృష్ణానగర్ నుంచి నీరు వెళ్లడానికి డ్రెయినేజీ వ్యవస్థ లేక చినుకు పడితే చాలు మురికి నీరు, వరదనీరు ఇళ్లలోకి చేరుతోంది. డైవర్షన్ నాలాలు నిర్మించి నీరు ఇళ్లలోకి రాకుండా చర్యలు తీసుకోవాలి.

– కాసారపు సుజాత, కృష్ణానగర్, 20వ వార్డు, జగిత్యాల

యావర్‌రోడ్‌లో డ్రెయినేజీ నిర్మించండి



20వ వార్డులో నాలాలు సరిగా లేక చిన్నవర్షానికే కాలనీ రోడ్లతో పాటు, ఇళ్లలోకి వరదనీరు ప్రవహిస్తోంది. యావర్‌రోడ్ వెంట డ్రెయినేజీ నిర్మించి 20వ వార్డులోని కృష్ణానగర్‌లో ఇళ్లలోకి నీరు రాకుండా చర్యలు తీసుకోవాలి.

– అనుమల్ల కృష్ణహరి, 20వ వార్డు కౌన్సిలర్, జగిత్యాల

పెద్దపల్లిలో కాంగ్రెస్ జెండా ఎగురవేస్తాం



కాంగ్రెస్‌లో చేరిన వారికి కండువాలు కప్పి ఆహ్వానిస్తున్న విజయరమణారావు

- మాజీ ఎమ్మెల్యే విజయరమణారావు
- కాంగ్రెస్‌లోకి భారీగా చేరికలు

ఎలిగేడు: రానున్న అసెంబ్లీ ఎన్నికల్లో కార్యకర్తల సమిష్టి కృషితో పెద్దపల్లిలో కాంగ్రెస్ జెండా తప్పకుండా ఎగురవేస్తామని టీపీసీసీ ఉపాధ్యక్షుడు, మాజీ ఎమ్మెల్యే చింతకుంట విజయరమణారావు అన్నారు. బుధవారం మండలంలోని శివపల్లిలోని ఆయన స్వగృహంలో ధూళికట్టకు చెందిన బీఆర్ఎస్, బీజేపీ కార్యకర్తలు కాంగ్రెస్‌లో చేరగా.. వారికి కండువాలు కప్పి ఆహ్వానించారు. బీఆర్ఎస్, బీజేపీ ప్రజావ్యతిరేక విధానాలు నచ్చకనే పార్టీలో చేరుతున్నారని, ఎమ్మెల్యే దాసరి మనోహర్‌రెడ్డి అరాచక పాలనకు చరమగీతం పాడాలని సూచించారు. పేదల సంక్షేమం కోసం అహర్నిశలు పాటుపడేది కేవలం కాంగ్రెస్ మాత్రమేనని పేర్కొన్నారు. పార్టీలో చేరిన వారిలో ప్రసాదరావు, వంశీధర్‌రావు, దుర్గం మల్లేశ్, లక్ష్మణ్, రమేశ్, మేడి శ్రీనివాస్, అప్పాల సతీష్, చింతకింది రాజయ్య, అక్కెపల్లి ఓదెలు తదితరులు ఉన్నారు. యూత్ కాంగ్రెస్ రాష్ట్ర కార్యదర్శి దుగ్యాల సంతోష్‌రావు, పార్టీ మండల అధ్యక్షుడు సామ రాజేశ్వర్‌రెడ్డి, సర్పంచులు అర్శనపల్లి వెంకటేశ్వర్‌రావు, దుగ్యాల శ్వేత, నాయకులు రంగు శ్రీనివాస్‌గౌడ్, అమ్ముల శ్రీనివాస్, అమ్ముల ఓదెలు తదితరులు పాల్గొన్నారు.





అమ్మవారికి ఆషాఢ బోనాలు

గోదావరిఖని: ఓసీపీ-3లో మైసమ్మతల్లికి ఆషాఢ బోనాలు నిర్వహించారు. బుధవారం డప్పుచప్పుళ్లు, పోతరాజుల నృత్యాల మధ్య అమ్మవారికి బోనాలు, మేకపోతులను బలిచ్చారు. ప్రజలను చల్లంగా చూడాలని అమ్మవారికి ప్రత్యేక పూజలు చేశారు.

జూలై 2 వరకు ఎంసెట్ ధ్రువపత్రాల పరిశీలన



సర్టిఫికెట్లు పరిశీలిస్తున్న అధికారులు

గోదావరిఖనిటౌన్: జూలై రెండో తేదీ వరకు ఎంసెట్–2023 అభ్యర్థుల ధ్రువపత్రాల పరిశీలన ఉంటుందని గోదావరిఖని పీజీ కళాశాల ప్రిన్సిపల్ ఎస్.రమాకాంత్ తెలిపారు. అభ్యర్థులు ఎంసెట్ ర్యాంక్‌కార్డు, హాల్‌టికెట్, ఆధార్ కార్డు, ఆరో తరగతి నుంచి ఇంటర్ వరకు స్టడీ సర్టిఫికెట్లు, కులం, ఆదాయం ఒరిజినల్, ఒక జత జిరాక్స్ సర్టిఫికెట్లతో వెరిఫికేషన్‌కు రావాలని సూచించారు. పరిశీలన పూర్తయిన వారు జూలై 8 వరకు వెబ్ ఆప్షన్లు ఇవ్వాలని తెలిపారు. హెల్ప్‌లైన్ సెంటర్ కో–ఆర్డినేటర్ డి.సురేష్‌కుమార్, రమేశ్, రవి, ప్రసాద్, అజయ్, సావిత్రి యాదయ్య ఉన్నారు.

బల్దియా షాపింగ్ కాంప్లెక్స్‌లో సబ్‌రిజిస్ట్రార్ కార్యాలయం



మాట్లాడుతున్న ఎమ్మెల్యే కోరుకంటి చందర్

గోదావరిఖని: గోదావరిఖనికి మంజూరైన సబ్‌రిజిస్ట్రార్ కార్యాలయాన్ని పోచమ్మ మైదానంలోని మున్సిపల్ షాపింగ్ కాంప్లెక్స్‌లో ఏర్పాటు చేస్తున్నట్లు ఎమ్మెల్యే కోరుకంటి చందర్ తెలిపారు. బుధవారం ల్యాండ్, రెవెన్యూ అండ్ రిజిస్ట్రేషన్ ప్రిన్సిపల్ సెక్రటరీ నవీన్ మిట్టల్‌ను కలిసి విన్నవించగా ఆయన అనుమతిస్తూ ఆదేశాలు జారీ చేశారని తెలిపారు. మున్సిపల్ కమిషనర్‌కు త్వరలో ఆదేశాలు అందనున్నాయన్నారు. ఎమ్మెల్యే వెంట డిప్యూటీ మేయర్ నడిపెల్లి అభిషేక్‌రావు పాల్గొన్నారు.

స్వచ్ఛ ఓటరు జాబితా లక్ష్యంగా పనిచేయాలి



సమావేశంలో మాట్లాడుతున్న కలెక్టర్ సంగీత, పాల్గొన్న అధికారులు

- చనిపోయిన వారి పేర్లను జాబితా నుంచి తొలగించాలి
- ఓటరు జాబితాపై తహసీల్దార్లతో జూమ్ సమావేశం

పెద్దపల్లిరూరల్: స్వచ్ఛ ఓటరు జాబితా తయారు చేయడమే లక్ష్యంగా అధికారులు పనిచేయాలని, ఎన్నికల కమిషన్ నిబంధనలు పకడ్బందీగా అమలు చేయాలని కలెక్టర్ సంగీత అన్నారు. బుధవారం కలెక్టరేట్ నుంచి అదనపు కలెక్టర్ లక్ష్మీనారాయణతో కలిసి తహసీల్దార్లతో జూమ్ వీడియోలో మాట్లాడారు. అసెంబ్లీ ఎన్నికలకు సన్నద్ధం కావాలంటూ ఎన్నికల కమిషన్ సూచనల మేరకు ఓటరు జాబితాపై ప్రత్యేక దృష్టి సారించాలని, ఓటర్ల జనాభా, పురుష, స్త్రీ ఓటర్ల నిష్పత్తిని పోలింగ్ కేంద్రాల వారీగా పరిశీలించాలని సూచించారు. మరణించిన వారి పేర్లను జాబితా నుంచి తొలగించాలని పేర్కొన్నారు. జిల్లాలో చేపట్టిన ఇంటింటి సర్వే వివరాలను ఆన్‌లైన్ లో నమోదు చేయాలన్నారు. ఒకే ఇంట్లో ఆరుగురి కంటే అధికంగా జిల్లాలో 7,072 ఓటర్లు ఉన్న కేటగిరీలో ఉన్నారని తేలిందన్నారు. వారినుంచి ఫారం 8 తీసుకుని ఆ ఇంటి నంబర్, సబ్‌నంబర్లతో నమోదు చేయాలని సూచించారు. నూతన ఓటర్ల నమోదు జూలై 13 నాటికి పూర్తి చేయాలన్నారు. సమావేశంలో ఆర్డీవోలు వెంకటమాధవరావు, వీరబ్రహ్మాచారి, ఎలక్షన్ డీటీ ప్రవీణ్, తదితరులు పాల్గొన్నారు.





ఘనంగా అమ్మవారి శోభాయాత్ర

సుల్తానాబాద్: పట్టణంలోని శ్రీవేణుగోపాలస్వామి, సాంబశివాలయంలోగల శ్రీవారాహిదేవి నవరాత్రి ఉత్సవాల్లో భాగంగా అమ్మవారిని బుధవారం ఊరేగించారు. మహిళలు కోలాటం ఆడుతూ శోభాయాత్ర నిర్వహించారు. ఆషాఢమాసం సందర్భంగా గోరింటాకు వేడుక జరిపారు. పూజారి రమేశ్ ఆధ్వర్యంలో భక్తులకు తీర్థప్రసాదాలు అందించారు.

క్లుప్తంగా

తహసీల్దార్ విధులకు ఆటంకం కలిగించిన ఇద్దరిపై కేసు

పాలకుర్తి(రామగుండం): స్థానిక తహసీల్దార్ జె.సునీత విధులకు ఆటంకం కలిగించిన ఇద్దరు వ్యక్తులపై కేసు నమోదు చేసినట్లు బసంత్‌నగర్ ఎస్సై వెంకటేశ్ బుధవారం తెలిపారు. ఆయన వివరాల ప్రకారం.. జీడీనగర్‌కు చెందిన సూర ఎల్లయ్య, బసంత్‌నగర్‌కు చెందిన ముత్యం రాము ఈ నెల 24న కన్నాల గ్రామ శివారులోని ప్రభుత్వ భూమిలో అక్రమంగా మట్టి వెలికి తీస్తున్నారని తహసీల్దార్‌కు సమాచారం వచ్చింది. వెంటనే అక్కడికి వెళ్లిన ఆమె అనుమతి పత్రాలు చూపించమని కోరారు. అయితే ఎలాంటి పత్రాలు చూపించకపోగా తహసీల్దార్ విధులకు ఆటంకం కలిగించడంతోపాటు సీజ్ చేసిన జేసీబీ, టిప్పర్‌లను తమ వెంట తీసుకెళ్లారు. దీనిపై తహసీల్దార్ సునీత మంగళవారం సాయంత్రం ఇచ్చిన ఫిర్యాదు మేరకు ఎల్లయ్య, రాములపై కేసు నమోదు చేసినట్లు ఎస్సై పేర్కొన్నారు.

డిస్ట్రక్టివ్ టెస్టింగ్‌పై అవగాహన


అవగాహన కల్పిస్తున్న అధికారులు

గోదావరిఖని(రామగుండం): డిస్ట్రక్టివ్ టెస్టింగ్‌పై బుధవారం ఆర్జీ–1 జీఎం కార్యాలయ సమావేశ మందిరంలో బుధవారం అవగాహన కల్పించారు. క్రిస్టల్ మెటలర్జికల్ సర్వీసెస్ సొల్యూషన్స్ ఆధ్వర్యంలో ఈ కార్యక్రమం నిర్వహించారు. సింగరేణిలోని అన్ని సీఎస్పీల్లో బంకర్ల నాణ్యత, బెల్ట్, బంకర్ల జాయింట్‌లలో ఎక్కడైనా పగుళ్లు ఉన్నాయో తెలుసుకునేందుకు ఈ పరిజ్ఞానం ఉపయోగించనున్నారు. కార్యక్రమంలో ఆర్జీ–1 జీఎం చింతల శ్రీనివాస్, సేఫ్టీ అధికారి సత్యనారాయణ, పానుగోటి శ్రీనివాస్, అధికారులు మదన్‌మోహన్, ఆంజనేయులు, చంద్రశేఖర్, ఎస్వీ రావు, మేనేజర్లు రమేశ్‌బాబు, తిరుపతి, రామస్వామి, దాసరి శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

గర్భిణులకు న్యూట్రిషన్ కిట్లు పంపిణీ


గర్భిణులకు కిట్లు అందిస్తున్న సూపరింటెండెంట్ దయాళ్‌సింగ్

కోల్‌సిటీ(రామగుండం): గోదావరిఖని జీజీహెచ్‌లో ఆస్పత్రి సూపరింటెండెంట్ దయాళ్‌సింగ్ బుధవారం గర్భిణులకు న్యూట్రిషన్ కిట్లు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. తల్లికి పౌష్టికాహారం, శిశువు ఆరోగ్యమే లక్ష్యంగా రాష్ట్ర ప్రభుత్వం ప్రతి గర్భిణికి రూ.1,962 విలువైన న్యూట్రిషన్ కిట్ అందిస్తోందన్నారు. ఇందులో న్యూట్రిమిక్స్ పౌడర్, ఐరన్ సిరప్, ఖర్జూరం, నెయ్యి తదితర పౌష్టికాహార వస్తువులున్నాయని తెలిపారు. గర్భిణులు ప్రభుత్వాస్పత్రుల్లోనే ప్రసవాలు చేయించుకోవాలని సూచించారు. కార్యక్రమంలో ఆర్ఎంవో అర్చన, స్టాఫ్‌నర్స్ విజయలక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

త్యాగానికి ప్రతీక.. బక్రీద్

- జిల్హిజ్ మాసంలో చంద్ర దర్శనం తర్వాత జరుపుకునే పండుగ
- దేవుడి పట్ల భక్తిశ్రద్ధలు ప్రకటించాలని పిలుపునిచ్చిన ప్రవక్త ఇబ్రహీం
- నేడు బక్రీద్



ఖుర్బానీ జంతువుల రక్త మాంసాలు అల్లాహ్‌కు చేరవు. కేవలం మీ భయ భక్తులు, విశ్వాసం, సమర్పణ గుణాలే చేరుతాయి.
– దివ్య ఖురాన్

కరీంనగర్‌కల్చరల్: ఇస్లాం మతాన్ని విశ్వసించే ప్రజల పండుగలలో బక్రీద్ ముఖ్యమైనది. దీన్ని త్యాగానికి ప్రతీకగా జరుపుకుంటారు. ఇస్లాం సంప్రదాయం ప్రకారం జిల్హిజ్ మాసంలో చంద్ర దర్శనం తర్వాత బక్రీద్‌ను జరుపుకుంటారు. ఈ పండుగనే ఈద్–ఉల్–అదా అని కూడా అంటారు. ఈ సృష్టి ఎంతో అద్భుతమైనదిగా అనిపిస్తుంది. ఎంతటి మేధావికైనా అర్థం కానిది, అధ్యయనం చేయవలసింది ఇంకా ఎంతో ఉందనిపిస్తుంది. మానవుని ఆలోచన పరిధికి మించి, ఈ సృష్టిని నియంత్రించే శక్తి ఒకటి ఉందని, ఆ శక్తిని అల్లాహ్(దైవం) అంటామని, ఆయన ప్రసాదించిన ఈ జీవితాన్ని ఆయన కోసం త్యాగం చేసేందుకు వెనకాడకూడదని సందేశాన్నిచ్చే పండుగ బక్రీద్. ప్రవక్త హజరత్ ఇబ్రహీం త్యాగనిరతి, ‘‘సహనశీలత, రుజువర్తనలను తెలుపుతుంది. మానవాళికి మార్గదర్శకత్వం వహించడానికి దైవం పక్షాన అవతరించిన ప్రవక్తల్లో ఇబ్రహీం ఒకరు. ఐదు వేల సంవత్సరాల క్రితం జన్మించిన ఆయన దేవుడే సకల చరాచర సృష్టికి కారకుడని, ఆయన పట్ల భక్తిశ్రద్ధలు ప్రకటించడం ద్వారా ముక్తిని పొందవచ్చని జాతికి పిలుపునిచ్చారు.

86 ఏళ్ల వయసులో సంతానం..

దేవుడొక్కడే అన్న ప్రవక్త ఇబ్రహీం వాదాన్ని వ్యతిరేకించినవారు ఆయనపై కక్షగట్టి, శారీరకంగా, మానసికంగా హింసలు పెట్టి, తుద ముట్టించేందుకు ఎన్నో ప్రయత్నాలు చేశారు. వృద్ధాప్యం వచ్చినా సంతానం లేకపోవడం ప్రవక్త ఇబ్రహీంను వేధించేది. సంతానాన్ని ప్రసాదించమని ఆయన నిరంతరం ఏకేశ్వరుడిని ప్రార్థించేవారు. 86 ఏళ్ల వయసులో దైవం ఒక కుమారుడిని ఇచ్చారు.

మరో పరీక్ష..

ప్రవక్త ఇబ్రహీంకు దైవం మరో కఠిన పరీక్ష పెట్టారు. కలలో అందిన సూచన మేరకు ఆయన తన కుమారుడిని బలి ఇచ్చేందుకు సిద్ధమవుతారు. కుమారుడు కూడా దైవాజ్ఞను అంగీకరిస్తాడు. తండ్రి ఇబ్రహీం కుమారుడిని జుబాహ్ చేశాడు. తీరా చూస్తే కుమారుడికి బదులు అక్కడ ఒక గొర్రె జుబాహ్ చేయబడి ఉంటుంది. దైవం పట్ల ప్రవక్త ఇబ్రహీంకు గల అచంచల భక్తి, విశ్వాసాలకు, త్యాగనిరతికి ప్రతీకగా ముస్లింలు ఏటా ఈద్–ఉల్–అదా పండుగ నిర్వహించుకుంటున్నారు. బక్రీద్ రోజు గొర్రెలను బలి ఇచ్చే సంప్రదాయం కూడా పుట్టింది.

ప్రవక్త ఇబ్రహీం భక్తికి పరీక్ష..

కుమారుడు పుట్టాడన్న ఆనందంలో ఓలలాడుతున్న సమయంలో దైవం ప్రవక్త ఇబ్రహీం భక్తిని పరీక్షించదలిచారు. నీ ప్రియ పుత్రుడిని మానవ మాత్రులు సంచరించని ఎడారిలో వదిలేయమని ఆజ్ఞాపించారు. ‘‘పుత్రుని కంటే దైవం ఆదేశమే గొప్పదన్న విశ్వాసంతో ఇబ్రహీం తన సతీమణి బీబీ హాజిరాను, కుమారుడు ఇస్మాయిల్‌ను ఎడారిలో వదిలిపెట్టారు. తల్లీబిడ్డ ఆకలి, దప్పికలతో అలమటించారు. అక్కడి సఫా కొండల మధ్య నీళ్ల కోసం వెదికారు. ఇస్మాయిల్ దాహంతో గిలగిలలాడుతున్నప్పుడు అతని కాలి మడమల మధ్య ఇసుకలో గుంత ఏర్పడి, ఆ ఎడారిలో నీటి ఊట పుడుతుంది. అదే సెలయేరుగా మారింది. ఆ నీటినే పవిత్రమైన జమ్‌జమ్ పానీ అంటారు. హహజ్‌కు వెళ్లిన యాత్రికులు ఆ పవిత్ర జలాన్ని సేవించి, తమ బంధుమిత్రులు, కుటుంబ సభ్యులు కోసం తీసుకువస్తారు.

పైపులైన్ ద్వారా వంట గ్యాస్


ఆర్ఎఫ్‌సీఎల్ వద్ద ఐవోసీ గ్యాస్ స్టేషన్

- తుది దశకు గ్యాస్ స్టేషన్ పనులు
- ఎల్పీజీ ధరతో పోలిస్తే 30 శాతం తక్కువ
- రిజిస్ట్రేషన్ ఫీజు చెల్లించినవారి ఇళ్లకు మీటర్ల బిగింపు
- ఆగస్టు 1 నాటికి సరఫరాకు చర్యలు


గౌతమినగర్‌లో నిర్మిస్తున్న పైపులైన్

ఫెర్టిలైజర్‌సిటీ(రామగుండం): రాష్ట్రంలో తొలిసారిగా ఇంటింటికీ పైపులైన్ ద్వారా గ్యాస్ సరఫరా చేసేందుకు చేపడుతున్న పనులు చివరి దశకు చేరుకున్నాయి. ఉమ్మడి కరీంనగర్ జిల్లాలో దీన్ని అమలు చేసేందుకు కేంద్ర ప్రభుత్వం నిర్ణయించింది. తొలిదశలో పెద్దపెల్లి జిల్లాలోని ఆర్ఎఫ్‌సీఎల్ టౌన్‌షిప్, రామగుండం కార్పొరేషన్ 39వ డివిజన్‌లోని గౌతమినగర్, శాంతినగర్‌లలో ఇంటింటికీ గ్యాస్ సరఫరా చేసేందుకు పైపులైన్ నిర్మాణ పనులు పూర్తి చేశారు. ఎన్టీపీసీ టౌన్‌షిప్, సింగరేణి ఇతర ప్రాంతాల్లో పనులు కొనసాగుతున్నాయి. ఇప్పటికే ఆర్ఎఫ్‌సీఎల్ టౌన్‌షిప్, శాంతినగర్, గౌతమినగర్‌లో ఇంటింటికీ గ్యాస్ కనెక్షన్ కోసం ఇండియన్ ఆయిల్ కార్పొరేషన్(ఐవోసీ) వినియోగదారులకు రూ.618లతో రిజిస్ట్రేషన్ ప్రారంభించారు. ఈ ఫీజు చెల్లించిన వినియోగదారుల ఇళ్లకు గ్యాస్ మీటర్లు బిగించారు. ఆగస్టు 1 నాటికి ఇంటింటికీ గ్యాస్ సరఫరా చేసేలా చర్యలు తీసుకుంటున్నారు.

మూడు జిల్లాల్లో పనులు పూర్తి..

రాష్ట్రంలోని గ్యాస్ ఆధారిత భారీ, చిన్న తరహా పరిశ్రమలకు పైపులైన్ ద్వారా గ్యాస్ సరఫరాతో మేలు జరుగుతుంది. ఉమ్మడి కరీంనగర్ జిల్లాలోని పెద్దపల్లి, రాజన్న సిరిసిల్ల, జగిత్యాల జిల్లాలకు సరఫరా చేసేందుకు పైపులైన్ నిర్మాణ పనులు పూర్తయ్యాయి. వీటితోపాటు సీఎన్‌జీ బంకులను అందుబాటులోకి తీసుకురానున్నారు. మల్లవరం పోర్టు నుంచి పైపులైన్ ద్వారా రామగుండం ఫెర్టిలైజర్ కెమికల్ లిమిటెడ్ కర్మాగారంలోని గ్యాస్ స్టేషన్‌కు ఇప్పటికే గ్యాస్ సరఫరా అవుతోంది. నూతనంగా నిర్మించిన ఇండియన్ ఆయిల్ కార్పొరేషన్ స్టేషన్‌కు గ్యాస్ తరలింపుపై ట్రయల్ రన్ నిర్వహించారు.

లీకేజీ అవకాశాలు తక్కువ..

ఎల్పీజీ గ్యాస్ సిలిండర్‌తో పోలిస్తే పైపులైన్ ద్వారా సరఫరా అయ్యే గ్యాస్ ధర 30 శాతం వరకు తక్కువగా ఉండనుంది. పైపులైన్ ద్వారా వచ్చే గ్యాస్ బరువు తక్కువగా ఉండటంతో లీకేజీ, అగ్ని ప్రమాదాలు సంభవించే అవకాశాలు తక్కువ. వినియోగదారుల ఇళ్లకు మీటర్లు బిగించి, యూనిట్ల ఆధారంగా బిల్లు వసూలు చేస్తారు.

కార్పొరేట్ పర్సనల్ జీఎంకు సన్మానం


కుమార్‌రెడ్డిని సన్మానిస్తున్న జీఎం మనోహర్


దుర్గాప్రసాద్‌ను సన్మానిస్తున్న అధికారులు

గోదావరిఖని(రామగుండం): ఈ నెలాఖరున ఉద్యోగ విరమణ పొందనున్న కార్పొరేట్ పర్సనల్ జీఎం ఎ.కుమార్‌రెడ్డిని ఆర్జీ–2 జీఎం మనోహర్ బుధవారం సన్మానించారు. తన కార్యాలయంలో జరిగిన కార్యక్రమంలో ఆయనకు శాలువా కప్పి, జ్ఞాపిక అందించారు. కార్యక్రమంలో ప్రాజెక్టు అధికారి శ్రీనివాస్‌రెడ్డి, ఏరియా ఇంజినీర్ నరసింహారావు, పర్సనల్ డీజీఎం రాజేంద్రప్రసాద్, వర్క్‌షాప్ డీజీఎం ఎర్రన్న, సివిల్ డీజీఎం ధనుంజయ, ఐఈడీ డీజీఎం మురళీకృష్ణ, సీనియర్ సెక్యూరిటీ అధికారి రమణ తదితరులు పాల్గొన్నారు.

ఓసీపీ–3 ప్రాజెక్టు ఇంజినీర్‌కు..

గోదావరిఖని(రామగుండం): ఈ నెలాఖరున ఉద్యోగ విరమణ పొందనున్న ఓసీపీ–3 ప్రాజెక్టు ఇంజినీర్ దుర్గాప్రసాద్‌ను అధికారులు బుధవారం సన్మానించారు. డ్రాగ్‌లైన్ సెక్షన్‌లో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో ఆయనను శాలువాలతో సత్కరించి, జ్ఞాపిక అందజేశారు. బ్రాంచి సెక్రటరీ ఇటిక్యాల బాలయ్య, డ్రాగ్‌లైన్ ఇన్‌చార్జి విజయ్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

హైపవర్ కమిటీ వేతనాలు చెల్లించాలి


గేట్ మీటింగ్‌లో మాట్లాడుతున్న సత్తయ్య

కమాన్‌పూర్(రామగిరి): సింగరేణి సంస్థలో కార్మికులకు మెరుగైన సేవలందించడానికి బీఎంఎస్ కృషి చేస్తోందని ఆ సంఘం అధ్యక్షుడు యాదగిరి సత్తయ్య అన్నారు. ఆర్జీ–3 ఓసీపీ–2లో బుధవారం ఏర్పాటు చేసిన గేట్ మీటింగ్‌లో ఆయన మాట్లాడారు. సింగరేణి వ్యాప్తంగా కాంట్రాక్ట్ కార్మికులకు హైపవర్ కమిటీ వేతనాలు కోల్ ఇండియా మాదిరిగా చెల్లించాలని డిమాండ్ చేశారు. వారికి అన్ని సౌకర్యాలు కల్పించాలన్నారు. నాయకులు ఆరుకాల ప్రసాద్, మాదాసు రవీందర్, ఎండీ.జానీ, మామిడి స్వామి, కొండ్ర ఐలయ్య, విద్యాసాగర్, కాశెట్టి నగేశ్ తదితరులు పాల్గొన్నారు.

నేడు అమెరికాకు ఎమ్మెల్యే చందర్

- సాఫ్ట్‌వేర్ సంస్థల వ్యవస్థాపకులతో సమావేశం

గోదావరిఖని(రామగుండం): గోదావరిఖనిలో ఐటీపార్క్ ఏర్పాటు కోసం ఎమ్మెల్యే కోరుకంటి చందర్ గురువారం అమెరికాకు వెళ్లనున్నారు. అక్కడి పారిశ్రామికవేత్తలతో సమావేశం కానున్నా రు. పారిశ్రామికవేత్తలు ముందుకొస్తే ఆగస్టులో ఐటీ పార్క్ ప్రారంభిద్దామని రాష్ట్ర ఐటీశాఖ మంత్రి కేటీఆర్ ప్రకటించిన విషయం తెలిసిందే. జూలై 1న డల్లాస్‌లో పాలకుర్తి మండలానికి చెందిన సాఫ్ట్‌వేర్ రంగ నిపుణులు వ్యాల హరీశ్‌రెడ్డి నేతృత్వంలో 3న ప్రసాద్ తోటకూర ఆధ్వర్యంలో అక్కడి సాఫ్ట్‌వేర్ సంస్థల వ్యవస్థాపకులు, పారిశ్రామిక వేత్తలతో సమావేశం కానున్నారు. నాటా ఆహ్వానం మేరకు డల్లాస్ కన్వెన్షన్ సెంటర్‌లో ఈనెల 30 నుంచి జూలై 2 వరకు జరిగే సభలలో పాల్గొననున్నారు.

రెండో రోజూ నర్సరీ కార్మికుల సమ్మె


నిరసన తెలుపుతున్న కాంట్రాక్టు కార్మికులు

కమాన్‌పూర్(మంథని): తమ సమస్యలు పరిష్కరించాలని ఆర్జీ–3 ఏరియాలోని సెంటనరీకాలనీ నర్సరీలో పని చేస్తున్న కాంట్రాక్టు కార్మికులు డిమాండ్ చేశారు. వారు చేపట్టిన సమ్మె బుధవారం రెండో రోజుకు చేరింది. ఐఎఫ్‌టీయూ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఆకుల వెంకన్న సింగరేణి ఫారెస్టు అధికారి కర్ణకు ఈ విషయాన్ని తెలిపారు. ప్రస్తుతం కాంట్రాక్టర్ అందుబాటులో లేడని, వచ్చిన తర్వాత సమస్యలు పరిష్కరిస్తామని హామీ ఇవ్వడంతో కాంట్రాక్టు కార్మికులు సమ్మె విరమించి, విధుల్లో చేరారు.

బావిలో దూకి మహిళ ఆత్మహత్య

ధర్మారం(ధర్మపురి): పత్తిపాక గ్రామానికి చెందిన భూర్ల విజయలక్ష్మి(48) ఆత్మహత్య చేసుకున్నట్లు ఎస్సై సత్యనారాయణ తెలిపారు. ఆయన వివరాల ప్రకారం.. ఏడాది క్రితం విజయలక్ష్మి కుమారుడు ఇంట్లోనే ఉరేసుకొని, ఆత్మహత్య చేసుకున్నాడు. అప్పటినుంచి ఆమె తన కుమారుడిని తలుచుకుంటూ రోదిస్తోంది. ఈ క్రమంలో జీవితంపై విరక్తి చెంది, బుధవారం సాయంత్రం గ్రామ శివారులోని వ్యవసాయ బావిలో దూకింది. మృతురాలి భర్త రాజయ్య ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని, దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై పేర్కొన్నారు.

జూలై 1న 17 పాఠశాలలకు సెలవు

పెద్దపల్లిరూరల్: జిల్లాలో గ్రూప్–4 పరీక్షలు నిర్వహించే 17 పాఠశాలలకు జూలై ఒకటిన (శనివారం) సెలవు ప్రకటిస్తున్నట్లు డీఈవో మాధవి బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. గ్రూప్–4 పరీక్షకు జిల్లాలోని 17 పాఠశాలలను కేంద్రాలుగా ఎంపిక చేశామని, ఉదయం ఎనిమిది నుంచి పరీక్ష ప్రారంభం కానున్న నేపథ్యంలో ఆ పాఠశాలలకు సెలవు ప్రకటించామని వెల్లడించారు. ఈ విషయాన్ని తల్లిదండ్రులు, విద్యార్థులు గమనించాలని పేర్కొన్నారు.

కాంట్రాక్టు కార్మికుడికి వైద్యం అందించాలి


శ్రీనివాస్ కుటుంబసభ్యులను పరామర్శిస్తున్న ప్రసన్నకుమార్

జ్యోతినగర్(రామగుండం): ఎన్టీపీసీ రామగుండం ప్రాజెక్టులో విధులు నిర్వహిస్తూ ప్రమాదవశాత్తు గాయపడిన కాంట్రాక్టు కార్మికుడు చకిలం శ్రీనివాస్‌కు పర్మినెంట్ కార్మికులతో సమానమైన వైద్య సేవలందించాలని బీఎస్పీ రామగుండం నియోజకవర్గ ఇన్‌చార్జి గోలివాడ ప్రసన్నకుమార్ డిమాండ్ చేశారు. బుధవారం హైదరాబాద్‌లోని ఈఎస్ఐ ఆస్పత్రి ఐసీయూలో చికిత్స పొందుతున్న శ్రీనివాస్ పరిస్థితిని తెలుసుకున్నారు. ఆయన కుటుంబసభ్యులను రాష్ట్ర నాయకుడు దేవునూరి సంపత్‌కుమార్‌తో కలిసి పరామర్శించారు. ఎన్టీపీసీ అభివృద్ధి కోసం కాంట్రాక్టు కార్మికులు అలుపెరగని కృషి చేస్తున్నారని తెలిపారు. కానీ యాజమాన్యం వారిని కార్మికులను చిన్నచూపు చూస్తోందని ఆరోపించారు. ప్రమాదానికి గురైన శ్రీనివాస్‌ను హైదరాబాద్ పంపించి, చేతులు దులుపుకుందని మండిపడ్డారు. 30 శాతం కాలిన గాయాలతో ఉన్న బాధితుడిని మొదట అపోలో హాస్పటల్‌కు రిఫర్ చేశారన్నారు. అక్కడికి వెళ్తే రూ.లక్షల్లో ఖర్చవుతుందని వైద్యులు తెలుపగా కుటుంబసభ్యులు ఈఎస్ఐ ఆస్పత్రిలో చేర్పించారని పేర్కొన్నారు. ఇలాంటి దుస్థితి మరే ఇతర కాంట్రాక్టు కార్మికుడికి రాకూడదన్నారు. ఆయన వెంటన నాయకులు పర్శరాములు ముదిరాజ్, లక్ష్మణ్ తదితరులున్నారు.

కాంట్రాక్టు కార్మికుల వేతనాలు పెంచాలి



మాట్లాడుతున్న మధు

యైటింక్లయిన్‌కాలనీ(రామగుండం): సింగరేణి కాంట్రాక్టు కార్మికుల వేతనాలు పెంచాలని కాంట్రాక్టు కార్మిక సంఘం(సీఐటీయూ) రాష్ట్ర కార్యదర్శి మధు డిమాండ్ చేశారు. బుధవారం ఆర్జీ–2 ఏరియా యైటింక్లయిన్‌కాలనీలోని సంఘం కార్యాలయంలో నిర్వహించిన కాంట్రాక్టు కార్మికుల జనరల్ బాడీ సమావేశంలో ఆయన మాట్లాడారు. సింగరేణిలో కాంట్రాక్టు కార్మికుల వేతనాలు పెంచకుండా కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అడ్డుకుంటున్నాయని ఆరోపించారు. 2013 నుంచి అమలు కావాల్సిన కోల్ ఇండియా వేతనాలు ఇక్కడ అమలు చేయకుండా నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నాయని మండిపడ్డారు. మరోవైపు 2021లో జారీ చేసిన జీవో 22ను గెజిట్ చేయకుండా రాష్ట్ర ప్రభుత్వం కార్మికులకు ద్రోహం చేస్తోందన్నారు. ఫలితంగా వారు రోజుకు రూ.300 వరకు వేతనం నష్టపోతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. 2022లో సింగరేణి యాజమాన్యం రాష్ట్ర ప్రభుత్వానికి లేఖ రాసినా ఇప్పటివరకు స్పందించకపోవడం బాధాకరమన్నారు. సీఎం కేసీఆర్ చొరవ తీసుకొని, వేతనాలు పెంచేలా చూడాలని కోరారు. నాయకులు ఓదెలు, రాములు, సమ్మయ్య, రాజేశ్, వేణు, లక్ష్మణ్, కవిత, రాజకుమారి, సంపూర్ణ తదితరులు పాల్గొన్నారు.

‘నిర్వాసిత గ్రామాల్లో సమస్యలు పరిష్కరించండి’

జ్యోతినగర్(రామగుండం): రామగుండం మున్సిపల్ కార్పొరేషన్ పరిధిలోని సింగరేణి, ఎన్టీపీసీ, ఆర్ఎఫ్‌సీఎల్ పరిశ్రమలకు భూములు ఇచ్చిన నిర్వాసిత, ప్రభావిత గ్రామాల్లో సమస్యలను పరిష్కరించాలని కాంగ్రెస్ పార్టీ జిల్లా నాయకుడు ఎండీ.రహీం ఒక ప్రకటనలో డిమాండ్ చేశారు. ఐదో డివిజన్ మల్కాపూర్, శ్రీనగర్ కాలనీ, సత్రశాలపల్లి, ప్రశాంతి నగర్‌లకు చెందిన ప్రజలు సమస్యలతో సతమతమవుతున్నారని అన్నారు. రోడ్ల నిర్మాణం కోసం దరఖాస్తు ఇచ్చినప్పటికీ అధికారులు, పాలకులు స్పందించడం లేదని ఆరోపించారు. రోడ్లు నిర్మించకుంటే ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయం, ఎన్టీపీసీ పరిపాలనా భవనం, సింగరేణి ఆర్జీ–1, ఆర్ఎఫ్‌సీఎల్ కార్యాలయాల ఎదుట తమ పార్టీ ఆధ్వర్యంలో ప్రజలతో కలిసి నిరసన కార్యక్రమాలు చేపడుతామని హెచ్చరించారు.

ప్రభుత్వ భూమి ఆక్రమణకు యత్నం


వివాదం చోటుచేసుకున్న ప్రాంతం

జ్యోతినగర్(రామగుండం): రామగుండం పారిశ్రామిక ప్రాంతంలో భూముల ధరలు పెరగడంతో కార్పొరేషన్ ప్రాంతంలో ఎక్కడ ప్రభుత్వ భూమి కనిపిస్తే అక్కడ స్థలాల చదును చేస్తున్నారు కొందరు. మూడో డివిజన్ ప్రాంతంలోని జంగాలపల్లె శివారు డబుల్ బెడ్ రూం ఇళ్ల నిర్మాణాల సమీపంలో ఉన్న ప్రభుత్వ భూమిలో పేదలు ఇళ్లస్థలాల కోసం రెండు నెలలుగా గుడారాలు వేసుకుని నిరీక్షిస్తున్నారు. మరికొందరు మాత్రం సంఘాల భవనాల కోసం ఆ స్థలాలను చదును చేయడం ప్రారంభించారు. ఈ విషయమై రెవెన్యూ అధికారులకు సమాచారం అందడంతో ప్రభుత్వ స్థలాన్ని ఎవరూ ఆక్రమించరాదని, చట్టపరమైన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.

బక్రీద్ ప్రార్థనలకు ఏర్పాట్లు


ఈద్గా వద్ద ఏర్పాట్లను పర్యవేక్షిస్తున్న మున్సిపల్ చైర్‌పర్సన్, కమిషనర్ తదితరులు

పెద్దపల్లిరూరల్: జిల్లాకేంద్రం శివారు చందపల్లిలోని ఈద్గా వద్ద గురువారం జరిగే బక్రీద్ ప్రార్థనలకు చేపట్టిన పనులను మున్సిపల్ చైర్‌పర్సన్ మమతారెడ్డి కమిషనర్ శ్రీనివాసరెడ్డితో కలిసి పరిశీలించారు. ముస్లింలకు అసౌకర్యం కలగకుండా చర్యలు తీసుకున్నట్లు పేర్కొన్నారు. ఏఈ సతీష్, మనోహర్ తదితరులున్నారు.

వానాకాలం ఇబ్బందుల్లేకుండా చర్యలు

వరదనీటితో ఏర్పడే సమస్యలను గుర్తించి పరిష్కరించేలా చర్యలు తీసుకోవాలని మమతారెడ్డి సంబంధిత అధికారులను ఆదేశించారు. పెద్దపల్లిలోని పలు వార్డులను పరిశీలించారు. ప్రధాన కూరగాయల మార్కెట్‌లో సమస్యలు అడిగి తెలుసుకున్నారు. వానాకాలంలో పట్టణ ప్రజలకు ఇబ్బంది తలెత్తకుండా చూడాలని మున్సిపల్ కమిషనర్ శ్రీనివాసరెడ్డి, ఇంజినీరింగ్ అధికారులను ఆదేశించారు.

టేకుమట్ల మండలానికి శాత్రాజ్‌పల్లి బదిలీ

మంథని: మంథని రెవెన్యూ డివిజనల్ ముత్తారం మండలం పారుపల్లి పంచాయతీ పరిధిలో కొనసాగుతున్న శాత్రాజ్‌పల్లి గ్రామాన్ని జయశంకర్‌భూపాలపల్లి జిల్లా టేకుమట్ల మండలానికి బదిలీ చేస్తూ రాష్ట్ర ప్రభుత్వం బుధవారం ఉత్తర్వులు జారీ చేసింది. గ్రామం మానేరు నది అవతలి వైపు ఉంటుంది. జయశంకర్ భూపాలపల్లి జిల్లాలోకి మారడం అక్కడి వాసులకు ఇష్టం లేదని తెలుస్తోంది.

ప్రజాస్వామ్య పద్ధతితో ఓటింగ్ జరపాలి

- సింగరేణి కోల్‌మైన్స్ ఆఫీసర్స్ అసోసియేషన్ నాయకులు


సమావేశమైన అసోసియేషన్ నాయకులు

గోదావరిఖని(రామగుండం): సింగరేణి అధికారుల సంఘం ఎన్నికలను లాబీయింగ్ పద్ధతిన కాకుండా ప్రజాస్వామ్య పద్ధతిలో జరపాలని సింగరేణి కోల్ మైన్స్ ఆఫీసర్స్ అసోసియేషన్ నాయకులు డిమాండ్ చేశారు. బుధవారం గోదావరిఖనిలోని ఆర్సీవోఏ క్లబ్‌లో సంఘం ప్రతినిధుల సమావేశం నిర్వహించారు. రామగుండం రీజియన్ ఉపాధ్యక్షులు పానుగోటి శ్రీనివాస్, మధుసూదన్, నాగేశ్వర్‌రావు ఆధ్వర్యంలో రామగుండం, బెల్లంపల్లి, కొత్తగూడెం రీజియన్ ప్రతినిధులు, సెంట్రల్ కమిటీ, ఎపెక్స్ కమిటీ ప్రతినిధులు హాజరై, పలు తీర్మానాలు చేశారు. బైలాస్ ప్రకారం బ్రాంచి ఎన్నికలు ప్రత్యక్ష పద్ధతిలో నిర్వహించాలన్నారు. అధికారులకు సంబంధం లేని, వారి పరిధిలో లేని విషయాలపై ఇచ్చిన చార్జిషీట్లు వెంటనే ఉపసంహరించాలని, అధికారులకు న్యాయమైన ప్రమోషన్ పాలసీ అమలు చేయాలని కోరారు. కోల్ ఇండియాలో మాదిరిగా పదోన్నతి కల్పించాలన్నారు. గనుల్లో అధికారులు సరిపడా లేరని, స్టాట్యుటరీ సూపర్‌వైజర్లు, టెక్నీషియన్స్ కొరత కారణంగా అధికారులపై పని భారం, ఒత్తిడి పెరుగుతోందని తెలిపారు. 2021–22 ఆర్థిక సంవత్సరం పీఆర్పీ చెల్లించాలని, కోల్ ఇండియా అధికారులకు ఇచ్చినట్లు సింగరేణి అధికారులకు ల్యాప్‌టాప్‌లు ఇవ్వాలన్నారు. సీఎం కేసీఆర్ ఇచ్చిన హామీ మేరకు ఉచిత విద్యుత్, ఐఐటీ/ఐఐఎం ఫీజు రీయింబర్స్‌మెంట్ వర్తింపజేయాలని పేర్కొన్నారు. సీఐఎల్‌లో జాతీయస్థాయి కమిటీ నిర్ణయం మేరకు అధికారులకు ఓఎన్‌జీసీ వేతనాలు, ఇతర అలవెన్స్ చెల్లింపు డిమాండ్‌కు మద్దతు ప్రకటించారు. కార్పొరేట్ అధ్యక్షుడు విజయభాస్కర్‌రెడ్డి, మందమర్రి అధ్యక్షుడు కె.రాజేందర్, శ్రీరాంపూర్ అధ్యక్షుడు ఖదీర్, ఎపెక్స్ ఉపాధ్యక్షుడు చిలుక శ్రీనివాస్, మణుగూరు సెక్రటరీ శ్రీనివాస్, జాయింట్ సెక్రటరీ టీటి చంద్రమౌళి, ఎంఆర్‌జీకే మూర్తి తదితరులు పాల్గొన్నారు.